గదుల కొరత.. వసతులు అంతంతే..!

- చెట్ల కిందే చదువులు
- అసంపూర్తిగా భవన నిర్మాణాలు
- తరగతి గదులు సరిపోక విద్యార్థుల అవస్థలు


చాపాడులో నిధులు రాక ఆగిపోయిన భవన నిర్మాణం


విద్యార్థులకు చెట్ల కింది బోధిస్తున్న ఉపాధ్యాయుడు

చాపాడు: ప్రభుత్వ పాఠశాలలు సమస్యలకు నిలయాలుగా మారాయి. భావి పౌరులను తీర్చిదిద్దాల్సిన పాఠశాలలు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఆహ్లాదకర వాతావరణంలో చదవాల్సిన విద్యార్థులు అవస్థల మధ్య పాఠాలు నేర్చుకుంటున్నారు. తరగతి గదులు సరిపోక చెట్ల కిందే చదువులు సాగిస్తున్నారు. చాపాడు మండలం చియ్యపాడు లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత ప్రభుత్వంలో నాడు–నేడు ఫేజ్–2 కింద గతేడాది రెండు గదులు మంజూరయ్యాయి. ఒక్కో గది రూ.15లక్షలతో నిర్మించేందుకు పనులు చేపట్టారు. పిల్లర్ల దశలో నిధుల కొరతతో పనులు ఆగాయి. 200 మంది విద్యార్థులు ఉన్న ఈ స్కూల్‌లో రెండు గదులు మాత్రమే ఉండటంతో పాఠశాలలోని వేదికపై, చెట్ల క్రింద విద్యార్థులను కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తున్నారు. గదుల కొరత కారణంగా ఇలాంటి దుస్థితి నెలకొందని అక్కడి ఉపాధ్యాయులు చెబుతున్నారు.

అసంపూర్తి పనులతో అవస్థలు

చాపాడు మండల వ్యాప్తంగా 61 ప్రభుత్వ పాఠశాలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా మొదటి విడతలో 23 పాఠశాలలు రూ.5.17కోట్లతో వివిధ రకాలైన అభివృద్ధి పనులు పూర్తి అయ్యాయి. రెండో దశ నాడు–నేడు క్రింద 23 పాఠశాలలకు రూ.8.30 కోట్ల నిధులు మంజూరు కాగా రూ.4.49కోట్లు ఖర్చు చేశారు. పలు గ్రామాల్లో చేపట్టిన పాఠశాలల అభివృద్ధి పనులు నిర్మాణం మధ్యలో నిలిచిపోయిన పనులకు రూ.3.54 కోట్లు రావాల్సి ఉంది. ఆరు నెలలుగా నిధులు రాకపోవడంతో పనులు అసంపూర్తిగా ఉన్నాయి. మండల కేంద్రమైన చాపాడులోని నూతన హైస్కూల్ భవనం ఐదు గదులు నిర్మిస్తుండగా రెండు గదులు అసంపూర్తిగా ఉన్నాయి. అలాగే అయ్యవారిపల్లెలో రూ.1.22 కోట్లతో 6 గదులు పూర్తి దశకు చేరుకోగా రూ.80.90లక్షలు మంజూరైంది. వీటితో పాటు నిర్మాణ పనులు పూర్తి దశలో ఉన్న పాఠశాలలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన సామగ్రి రాకపోవటంతో మరుగుదొడ్ల పనులు అసంపూర్తిగా ఉన్నాయి.

నిరుపయోగంగా సామగ్రి

పాఠశాలల్లో మరుగుదొడ్ల కోసం తెచ్చిన టైల్స్, పింగానీలు, ఇతర సామగ్రి నిరుపయోగంగా ఉన్నాయి. గత ప్రభుత్వం కేటాయించిన నిధులు ఖర్చు చేసినప్పటికీ ఈ ప్రభుత్వ హయాంలో నిబంధనల మేరకు అందాల్సిన వివిధ మెటీరియల్స్ రాకపోవడం, దీంతో పాటు నాడు – నేడు పనులపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పనులు అర్ధాంతరంగా అగిపోయాయని ఆయా పాఠశాలలు ఉపాధ్యాయులు చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఆగిపోయిన నిర్మాణ పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

పనులు పూర్తి కాలేదు



రెండో విడత నాడు–నాడులో మంజూరైన పనులు నిధుల కొరత కారణంగా పూర్తి కాలేదు. ఇప్పటి వరకూ 60శాతం వరకూ నిధులు వచ్చాయి. మిగిలిన నిధులు వస్తే పనులు పూర్తి అవుతాయి. పనులు పూర్తి అయితే విద్యార్థులకు గదులు, వసతుల కొరత తీరుతుంది.

–వి. వంశీకృష్ణ, ఎంఈఓ–2, చాపాడు మండలం

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు


ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన స్వయంభు లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మార్గశిర మాసం నాల్గవ శనివారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని, కాయకర్పూరం సమర్పించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. వచ్చిన భక్తులకు ఆలయ పూజారి పెంచలయ్యస్వామి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పలుపార్టీల నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వెల్లాలలో ధనుర్మాస పూజలు


శ్రీచెన్నకేశవ స్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు

రాజుపాళెం : మండలంలోని వెల్లాల పుణ్యక్షేత్రంలో శనివారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమ లింగేశ్వర స్వామి, పార్వతీదేవి, నరసింహుల స్వాములకు ధనుర్మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారు జాము నుంచే ఆలయ అర్చకులు స్వాములను ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేసి అలంకరించారు. భక్తులు స్వాములను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం సంజీవరాయ అన్న సత్రంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఘనంగా రతన్ టాటా జయంతి


రతన్ టాటా జెండాలను పట్టుకుని నినాదాలు చేస్తున్న సిబ్బంది

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ కార్యాలయంలో రతన్ టాటా 86వ జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను, గొప్పతనాన్ని పలువురు కొనియాడారు. పట్టణంలో సీనియర్ ఎస్‌బీఏ లీడర్ వంగల బాలిరెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ బ్రాంచ్ మేనేజర్ అనిల్ చౌదరి, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ శ్రీపతి దేవ కుమార్, మాదాసు మురళీ పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు


ఎస్సీకాలనీలో డ్రైనేజీ కాలువలో పూడిక తీయిస్తున్న గ్రామ పంచాయతీ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

గోపవరం : మండలంలోని రాచాయపేట గ్రామ పంచాయతీ పరిధిలో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. లోపించిన పారిశుధ్యం అనే శీర్షికతో శుక్రవారం సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన పంచాయతీ కార్యదర్శి నిఖిత, సర్పంచ్ నాగేంద్ర పారిశుద్ధ్య పనులు చేపట్టారు. రాచాయపేట ఎస్సీకాలనీలో డ్రైనేజీ కాలువల్లో పూడిక తీయించి వీధుల్లో బ్లీచింగ్ చల్లించారు. గత రెండు రోజులుగా పనులు ముమ్మరంగా చేపట్టారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ప్రతిఒక్కరు ఆరోగ్యంగా ఉంటారని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు


మాట్లాడుతున్న రీజనల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ డేవిడ్ కుమార్‌స్వామి

పోరుమామిళ్ల: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, విద్యార్థులు ఉన్నతికి పాటుపడాలని విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ డేవిడ్ కుమార్‌స్వామి పేర్కొన్నారు. స్థానిక డిగ్రీకళాశాలలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ శివరామకృష్ణారావు కుమారుడు డాక్టర్ శ్రీనివాస కుమార్ సహకారంతో ఏర్పాటు చేసిన కళావేదిక, క్యాంటిన్‌లను శనివారం డేవిడ్ కుమార్‌స్వామి, శివరామానంద సరస్వతి ప్రారంభించారు. ఈ సందర్భంగా డేవిడ్ కుమారస్వామి, శివరామానంద సరస్వతి కళాశాలలో అన్నివిభాగాలను పరిశీలించారు. కళాశాల సిబ్బందితో, సీపీడీసీ సభ్యులతో, విద్యార్థులతో, పూర్వ విద్యార్థులతో సమావేశమై కళాశాల అభివృద్ధికి అవసరమైన అంశాలపై చర్చించారు. డేవిడ్‌కుమారస్వామిని, శివరామానంద సరస్వతిని ప్రిన్సిపాల్ శామ్యూల్ డేవిడ్‌రాజు సన్మానించారు.

సాహితీ కృషీవలుడు సన్నపురెడ్డి

–నేడు సన్నపురెడ్డి సాహిత్య సమాలోచనం

పోరుమామిళ్ల: రచయిత సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి సాహితీ కృషీవలుడని వివేకానంద చైతన్య సమితి అధ్యక్షులు పాలకొలను నారాయణరెడ్డి కొనియాడారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సన్నపురెడ్డి సాహిత్య సమాలోచనం కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆయన నవలలకు జాతీయస్థాయి బహుమతులు, అవార్డులతో పాటు తానా బహుమతులు వచ్చాయని పేర్కొన్నారు. 80 కథలు, 7 నవలలు రాసి రాయలసీమకు కీర్తి ప్రతిష్టలు తెచ్చిన ఘనత సన్నపురెడ్డిదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కథా, నవలా రచయితలు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్ కోడూరు స్వతంత్ర బాబు, మోపూరి లలితకుమారి, డాక్టర్ సిరిగిరెడ్డి గంగాదేవి తదితరులు పాల్గొంటారని తెలిపారు.

హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం


మాట్లాడుతున్న ఆదిత్యారెడ్డి


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ, ఆదిత్యారెడ్డి

అట్లూరు: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలను రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విస్మరిస్తోందని యువనేత ఆదిత్యారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల వైఎస్సార్‌సీపీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆదిత్యారెడ్డి మాట్లాడుతూ అమలు చేయలేని వాగ్దానాలు ఎన్నికల్లో కూటమి నాయకులు, చంద్రబాబునాయుడు ఇచ్చారని, ఇప్పుడు అమలు చేయలేక వైఎస్సార్‌సీపీపై నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో ఐదేళ్ల వరకు విద్యుత్ చార్జీలు పెంచమని, ప్రజలే విద్యుత్ అమ్ముకునేలా సంపద సృష్టికి కృషి చేస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చిన 6 నెలలకే చతికిల పడ్డారని ఎద్దేవాచేశారు. కూటమి ప్రభుత్వ అక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఆప్కాబ్ మాజీ డైరెక్టర్ డాక్టర్ కల్యాణ చక్రవర్తి, జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీలు సీఎం బాషా, రాజశేఖర్, పార్టీ జిల్లా ప్రచార విభాగ అధ్యక్షుడు రాజీవ్‌బాషా, మాజీ ఉపసర్పంచ్ రాళ్లపల్లె నరసింహులు, తులసి సురేష్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఓ దిన పత్రిక 2025 క్యాలెండర్‌ను ఎమ్మెల్సీ డీసీ గోవింద రెడ్డి, యువనేత డి. ఆదిత్యారెడ్డి ఆవిష్కరించారు. జెడ్పీటీసీ గురివిరెడ్డి, కాంట్రాక్టర్ గురివిరెడ్డి, పార్టీ నాయకులు, భాస్కర్‌రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అరేబియన్ రెస్టారెంట్ ప్రారంభం


పూజ చేస్తున్న గంగిరెడ్డి మాధవరెడ్డి దంపతులు

ప్రొద్దుటూరు : స్థానిక మైదుకూరు రోడ్డులోని హోటల్ మాధవ్‌లో శనివారం మండి హౌస్ అరేబియన్ రెస్టారెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు గంగిరెడ్డి మాధవ రెడ్డి మాట్లాడుతూ గత కొన్నేళ్లు తాము హోటల్ మాధవ్‌ను నిర్వహిస్తున్నామన్నారు. మండి హౌస్ అరేబియన్ రెస్టారెంట్‌ను ప్రారంభించామని తెలిపారు. కస్టమర్ల అభిరుచి మేరకు చికెన్, మటన్, ప్రాన్స్ తదితర రకాల వంటకాలను అందిస్తామన్నారు.

రాజన్న కవి పద్య కవితా సంపుటి ఆవిష్కరణ


కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

ప్రొద్దుటూరు కల్చరల్ : విజయవాడ కేబీఎన్ కళాశాలలోని అమరజీవి పొట్టి శ్రీరాములు సభా ప్రాంగణంలో జరుగుతున్న ప్రపంచ 6వ తెలుగు రచయితల మహాసభల్లో ప్రముఖ కవి, గాయకుడు, రచయిత సగబాల రాజన్న కవి రచనా సంపుటిని ఆవిష్కరించారు. సాహితీ వేత్తలు డాక్టర్ జ్యోష్యుల కృష్ణబాబు, డాక్టర్ రంగాచార్యులు, సూర్యలక్ష్మి, రాణీ ప్రసాద్, ఎంఎస్ ఆచార్య పాల్గొన్నారు.

- మహాసభల్లో ఉపాధ్యాయుడు, రచయిత కొత్తపల్లె శ్రీనును ప్రపంచ రచయితల మహాసభల ప్రధాన కార్యదర్శి డాక్టర్ వి.పూర్ణచందు, సినీగేయ రచయిత భువనచంద్రలు శాలువ కప్పి సత్కరించారు.

మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి తీరని లోటు



సమావేశంలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్

ప్రొద్దుటూరు : ఆర్థిక సంస్కరణల కర్త, దేశ మాజీ ప్రధాన మంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణం దేశ ప్రజలకు తీరని లోటని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. శనివారం మున్సిపల్ కార్యాలయం సభాభవనంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్‌బీఐ గవర్నర్‌గా, కేంద్ర ఆర్థిక మంత్రిగా, ప్రధాన మంత్రిగా డాక్టర్ మన్మోహన్ సింగ్ దేశానికి అందించిన సేవలను మరవలేమని తెలిపారు. కౌన్సిల్ సభ్యులు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఆత్మకు శాంతి కలగాలని కోరుకున్నారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి సమావేశాన్ని వాయిదా వేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్లు పాతకోట బంగారు మునిరెడ్డి, ఆయిల్‌మిల్ ఖాజా, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, అధికారులు పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్‌కు నివాళి

పోరుమామిళ్ల: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు శనివారం సీపీఐ నాయకులు, కార్యకర్తలు పోరుమామిళ్లలో ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కేశవ, చెన్నయ్య, వీరయ్య, సఫా, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం అధ్వానం


కళాశాల ఎదుట ముళ్ల పొదలు, మురుగునీరు

పోరుమామిళ్ల: పట్టణంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్యం అధ్వానంగా మారింది. చెత్త నిర్వహణ వ్యవస్థ సరిగాలేక పోవడంతో ప్రధానరోడ్ల వెంబడి చెత్త పేరుకు పోతుంది. పారిశుధ్య మెరుగుకు చర్యలు చేపట్టాల్సిన అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుండటంతో పట్టణంలో పారిశుద్ధ్యం క్షీణిస్తోంది. రహదారుల వెంబడి చెత్త పేరుకు పోతోంది. వాటినుంచి వెలువడే దుర్వాసనకు ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు, ప్రజలు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట డ్రైనేజీ మురుగునీటి గుంతలా తయారైంది. మురుగునీరు నిలచిపోయి విపరీతమైన దుర్వాసన వెదజల్లుతోంది. దుర్వాసనతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగాలేక మురుగు నీరు కాలేజీ పరిసరాల్లో నిలిచిపోయింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చెత్తకుప్పల్లో దోమలు వృద్ధి చెంది. ప్రజలు రోగాలబారిన పడే అవకాశముంది, అధికారులు స్పందించి పారిశుధ్య మెరుగుదలకు చర్యలు చేపట్టాలని ఆల్ ఇండియా హ్యూమన్‌రైట్స్ అసోసియేషన్ సభ్యులు గంగన్న, ఫణిరావు, ప్రసాదరావు కోరుతున్నారు.

సృజనాత్మకతతో అద్భుతాలు సృష్టించవచ్చు


ఎక్స్‌కవేటర్ పనితీరును వివరిస్తున్న విద్యార్థులు

చాపాడు: సృజనాత్మకతతో అద్భుతాలు సృష్టించవచ్చని, విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను ఉపాధ్యాయులు వెలికితీయాలని మండల విద్యాశాఖాధికారి రవిశంకర్ సూచించారు. మండల విద్యా శాఖాధికారి రవిశంకర్ అన్నారు. స్థానిక జీఏఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మండల స్థాయి సైన్స్ ఫెయిర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని 8 ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులు వివిధ రకాల నమూనాలను ప్రదర్శించారు. వీటిలో టీచర్ ప్రాజెక్టు, వ్యక్తిగత విద్యార్థి ప్రాజెక్టు, విద్యార్థి గ్రూప్ ప్రాజెక్టు విభాగాలకు పోటీ నిర్వహించారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా సీబీఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్లు భద్రారెడ్డి, రామిరెడ్డి వ్యవహరించారు. ఈ పోటీల్లో టీచర్ విభాగంలో చాపాడు హైస్కూల్‌కు చెందిన బి.హరనాథ్, విద్యార్థుల వ్యక్తిగత విభాగంలో నరహరిపురం హైస్కూల్‌కు చెందిన టి.చరణ్ (ప్రథమ), స్థానిక కేజీబీవీకి చెందిన అంజలి (ద్వితీయ), గ్రూప్ విద్యార్థి విభాగంలో నరహరిపురం హైస్కూల్‌కు చెందిన పి.చాంద్ బాషా (ప్రథమ), లక్ష్మీపేట హైస్కూల్‌కు చెందిన రాజేశ్వరి, సి.గంగన (ద్వితీయ) గెలుపొందారు. గెలిచిన విద్యార్థులకు ఎంఈఓలు రవిశంకర్, వంశీకృష్ణ, హెచ్‌ఎం గౌస్‌మోద్దీన్ బహుమతులు అందజేశారు.

విజ్ఞానంతోనే సమాజాభివృద్ధి

ఖాజీపేట : విజ్ఞానంతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని ఎంఈఓ నాగ స్వర్ణలత అన్నారు. శనివారం ఖాజీపేట బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ విజ్ఞాన ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ఆలోచనలకు అనుగుణంగా ప్రయోగాలను చేసి ప్రదర్శనలో ఉంచారు. ప్రయోగాలను పరిశీలించి విద్యార్థుల ప్రతిభను పరిశీలన బృందం అభినందించింది. మొదటి బహుమతిని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు, రెండవ బహుమతిని ఖాజీపేట బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు, మూడవ బహుమతిని కస్తూర్బాగాంధీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు, నాలుగో బహుమతిని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు అందుకున్నారు.

రైతు సమస్యల పరిష్కారానికే సదస్సులు

చాపాడు: రైతుల సమస్యలు పరిష్కరిం చేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని తహసీల్దార్ రమాకుమారి పేర్కొన్నారు. మండలంలోని కుచ్చుపాప గ్రామంలో శనివారం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. తహసీల్దారు మాట్లాడుతూ భూ సమస్యలపై వచ్చని ఫిర్యాదులను పరిష్కరిస్తామన్నారు. ఎంపీపీ తెలిదేల లక్షుమయ్య మాట్లాడుతూ రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై రెవెన్యూ అధికారులు స్పందించి పరిష్కరించాలని కోరారు.

ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతర పోరాటం


మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా

బద్వేలు అర్బన్ : విద్యారంగ సమస్యల పరిష్కారానికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) నిరంతర పోరాటాలు కొనసాగిస్తోందని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా పేర్కొన్నారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభ జయప్రదం కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ప్రచారజాత శనివారం బద్వేలుకు చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ ఆవిర్భవించి 50 వసంతాలు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవ వేడుకలను కాకినాడలో జనవరి 5, 6, 7, 8వ తేదీల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.విజయకుమార్, పి.మహేష్‌బాబు, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు జి.వెంకట సుబ్బారెడ్డి, శివప్రసాద్, చెన్నయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలి


అంగన్‌వాడీ సిబ్బందికి సూచలిస్తున్న డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి

ప్రొద్దుటూరు రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆరోగ్య పరీక్షలను నిర్వహించి సమస్యలను గుర్తించాలని జమ్మలమడుగు డివిజన్ ఇన్‌చార్జి ఉప జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శివప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని దొరసానిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల ఆరోగ్య పరీక్షలను ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పిల్లల ఆరోగ్య విషయంలో ఏవైనా సమస్యలను గుర్తించినట్లైతే వారిని జిల్లా హాస్పిటల్, సర్వజన హాస్పిటల్‌కు పంపాలన్నారు. ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కేంద్రాల వర్కర్లు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. రోజుకు 30 మందికి పరీక్షలు నిర్వహించి, వారి వివరాలను రికార్డుల్లో తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు. హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు సూపర్ వైజర్ బీఏ వరప్రసాద్, సీహెచ్ఓ దివ్య లక్ష్మి, ఏఎన్‌ఎం సుప్రజ, అంగన్‌వాడీ వర్కర్ ఉమ, ఆశ కార్యకర్తలు సుజాత, పుష్ప, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

రోడ్డుపై ధాన్యం.. ప్రాణాలకు ప్రమాదం


ఏటూరు సమీపంలో రోడ్డుపై వరి ధాన్యం ఆరబోసిన రైతులు


త్రిపురవరానికి వెళ్లే రహదారిపై..

రోడ్లపై ప్రయాణించాలంటే వాహనదారులు జంకుతున్నారు. వరి పంట కోతలు మొదలయ్యాయంటే రోడ్లన్నీ కల్లాలను తలపిస్తుండటమే ఇందుకు కారణం. సగం రోడ్లు ధాన్యం కుప్పలతో ఆక్రమిస్తుండడంతో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారుతున్నాయి. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా దారులన్నీ ధాన్యం కల్లాలుగా దర్శనమిస్తున్నాయి. ఖాజీపేట నుంచి కమలాపురంనకు వెళ్లే ప్రధాన రహదారిలో రైతులు వరి ధాన్యాన్ని రోడ్లపై ఆరబోసుకుంటున్నారు. రోడ్డుపై సగ భాగం వరకు ధాన్యం పోయడంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం ఆరబోసిన ధాన్యాన్ని సాయంత్రం కుప్పలు చేసి రాత్రిళ్లు అక్కడే ఉంచుతున్నారు. రాత్రి సమయంలో కుప్పలు గమనించకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కొందరు ప్రాణాలు కోల్పోతే.. మరి కొందరు శాశ్వత అంగవైకల్యాన్ని పొంది మంచానికే పరిమితవుతున్నారు. ఇకనైనా రైతులు మేలుకుని రోడ్లపై వరి ధాన్యం ఆరబెట్టొద్దని ప్రయాణికులు కోరుతున్నారు.

– ఖాజీపేట